నాణ్యత లేకుండా కడుతున్న జగనన్న ఇళ్లు (ఫైల్)



హౌసింగ్‌లో అనకొండ వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. కొన్నేళ్ల నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆయన తీరు మారలేదని స్పష్టమౌతోంది. వైఎస్సార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు.. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం వరకూ ఆయన అక్రమాల పరంపర కొనసాగిందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలతో నిమిత్తం లేకుండా.. ప్రజా ప్రతినిధులను బుట్టలో వేసుకోవడం, అడ్డులేకుండా అక్రమాలకు పాల్పడటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని అంటున్నారు. వైసీపీ ఓటమి తరువాత తొలిసారిగా ఆయనకు గుబులు పట్టుకుందని సమాచారం. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి అండతో ఆయన భారీగా అక్రమాలకు పాల్పడటమే దీనికి కారణమని అంటున్నారు. శాఖపరంగా తనకు సహకరించే ఉన్నతాధికారి సెలవులో వెళ్లడంతో తన పరిస్థితి ఏమిటోనని ఆయన వణికిపోతున్నట్లు సమాచారం. గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీగా శైలజను కలెక్టర్ నియమించడంలో అనకొండ ఇంజనీరు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని సమాచారం.

- అనంతపురం సిటీ



అలాంటిలాంటోడు కాదు..!

ఇందిరమ్మ కాలం నుంచే అక్రమాలు

శిష్యులతో కలిసి దోపిడీ

ఉమ్మడి జిల్లా విడిపోయిన సమయంలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో ఉద్యోగుల సర్దుబాటు జరిగింది. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని సీకే పల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలకు సంబంధించిన ముగ్గురు ఏఈఈలను అప్పటి ఎమ్మెల్యే అండతో అనకొండ ఇంజనీరు బదిలీ చేయించుకున్నారు. గురు శిష్యులు కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణంలో ఎక్కడ సందు దొరికితే అక్కడ దోచుకున్నారు. ఆ ప్రాంతాల డీఈఈ కూడా వీరితో కొంత వరకూ చేతులు కలిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనకొండ శిష్యులైన ముగ్గురు ఏఈలు సైతం సిమెంటు, స్టీలు, ఇసుక తదితర సామగ్రిని పెద్దఎత్తున పక్కదారి పట్టించారు. స్టేజ్‌లతో సంబంధం లేకుండా అడ్డదిడ్డంగా బిల్లులు చేశారు. ఒక్కొక్కరు రూ.50 లక్షలకు పైగా సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక ఏఈ ఏకంగా తమ పరిధిలోని ఓ వైసీపీ నాయకుడి ఇంటికి 70 శాతం జగనన్న ఇళ్ల సామగ్రి తరలించడంలో కీలక పాత్ర పోషించారని తెలిసింది. ఈ ముగ్గురు ఏఈల పరిధిలోని ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారులకు సరఫరా చేసిన సామగ్రి, చేసిన బిల్లులు తదితరాలపై లోతుగా విచారిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు. అనకొండ శిష్యులు ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో ఏమాత్రం సంకోచం లేకుండా అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం.



సామగ్రి పక్కదారి..

జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం అందించే సిమెంట్, స్టీల్‌ను నగర శివారులోని గోడౌన్‌లో నిల్వ చేసి.. సరఫరా చేసేవారు. ఇక్కడే అసలు కథ మొదలైనట్లు సమాచారం. అనకొండ డీఈఈతో పాటు మరికొందరు ఉద్యోగులు కలిసి టన్నులకొద్దీ స్టీల్‌ను, వేల సంఖ్యలో సిమెంట్ బస్తాలను పక్కదారి పట్టించారని సమాచారం. అక్కడి వాచ్‌మన్, సిమెంట్ ఇన్‌చార్జిని అడ్డుగా పెట్టుకుని కథ నడిపించారని సమాచారం. ఇందుకు అప్పటి ఎమ్మెల్యే సహకారం కూడా ఉందని, సిమెంట్ విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. విచారణలోనూ అక్రమాలు తేలినట్లు తెలిసింది. అక్రమాలు బయటపడకుండా నాటి ఎమ్మెల్యే, అనకొండ జాగ్రత్త పడ్డారని సమాచారం. జిల్లా ఉన్నతాధికారి సమీప బంధువుకు వందల సంఖ్యలో సిమెంట్ బస్తాలను గుట్టుగా తరలించి, తమ వ్యవహారాలకు అడ్డు రాకుండా చూసుకున్నారని సమాచారం. బినామీ కాంట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని, జగనన్న ఇళ్ల సామగ్రిని పీఆర్ శాఖ సిమెంట్ రోడ్లకు తరలించి.. అప్పటి ఎమ్మెల్యే తోపు అక్రమాలకు పాల్పడ్డారని రోపణలు ఉన్నాయి. రాప్తాడు మాజీ ఎమ్మెల్యేకి అనుకూలంగా ఉండే వైస్ ఎంపీపీ స్థాయి నాయకుడు కురుగుంట జగనన్న ఇళ్ల నిర్మాణంలో ఏమాత్రం నాణ్యత పాటించకుండా సొమ్ము చేసుకున్నారు. ఇసుక, సిమెంట్, కంకర, స్టీల్‌ను పక్కదారి పట్టించారు. అనకొండ డీఈఈ క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాల్లోను భారీగా అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం.

మట్టి, ఇసుక వేసి బెడ్డింగ్ వేస్తున్న దృశ్యం (ఫైల్)



ప్రభుత్వం ఏదైనా.. అవినీతి పండిస్తాడు

ముగ్గురు శిష్యులతో సామగ్రిని మింగేశాడు

మడకశిరలో ఉన్నప్పుడే రాటుదేలి పోయాడు

జగన్ హయాంలో అక్రమాలు పరాకాష్టకు..

హౌసింగ్ అనకొండలో ఇప్పుడిప్పుడే గుబులు

కాంగ్రెస్ హయాం నుంచే..

వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో అనకొండ ఇంజనీరు మడకశిరలో పనిచేసేవారు. పెనుకొండ డీఈఈగా మరొక అధికారి ఉండేవారు. ఆ సమయంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం సిమెంట్, సిమెంట్ తీర్లను గోడన్లలో ఉంచి.. లబ్ధిదారులకు సరఫరా చేసింది. అప్పటి మంత్రిని మాయమాటలతో ప్రసన్నం చేసుకుని.. ఇద్దరూ భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్లలో దోచుకున్నట్లు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ అవినీతి, అక్రమాలపై అప్పటి ప్రభుత్వం విచారణకు అదేశించింది. కానీ విచారణ బుట్టదాఖలైంది. ఆ తరువాత కూడా అనకొండకు పెద్ద పీట వేస్తూనే ఉన్నారు. అక్రమ సంపాదనకు పనికొచ్చే అధికారి కావడంతో కొందరు ప్రజా ప్రతినిధులు కూడా ఆయనను ప్రోత్సహించారన్న ఆరోపణలు ఉన్నాయి.



పింఛన్ల పంపిణీపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్



సమావేశంలో కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. ఒకటో తేదీనే వందశాతం పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డీఆర్‌డీఏ, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి ఇప్పటికే సిబ్బందిని నియమించామని, లబ్ధిదారులను వారికి కేటాయించామని తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటలకే పంపిణీని ప్రారంభిస్తే వందశాతం సులభంగా సాధించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సొమ్ము అందించాలని సూచించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే డ్రా చేసిన సొమ్మును పంపిణీ చేసే సిబ్బందికి అందజేయాలని సూచించారు. జిల్లా, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని అన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, డీపీఓ ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లను తెచ్చిందే టీడీపీ

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూన్ 29: సామాజిక భద్రత పింఛన్లను తీసుకువచ్చిందే టీడీపీ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. వెంకటాపురంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జూలై 1 నుంచి పెంచిన పింఛన్లను అందిస్తామని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో నెలకు రూ.35 చొప్పున పింఛన్ అందించడం ప్రారంభించారని, దానిని ఈ రోజు రూ.4 వేలకు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందనని అన్నారు. రూ.35 ఉన్న పింఛన్‌ను రూ.75కు పెంచింది చంద్రబాబేనని, 2004లో వైఎస్సార్ రూ.200 ఇస్తానని రూ.25 మాత్రమే పెంచారని గుర్తు చేశారు. 2014 జూన్ 8న చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే పింఛన్‌ను రూ.1000కి పెంచారని అన్నారు. ఆ తరువాత రూ.2 వేలు చేసింది కూడా చంద్రబాబే అని అన్నారు. ఐదేళ్లలో పదిరెట్లు పెంచి రికార్డు సృష్టించారని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చేనేతలు, మత్స్యకారులకు పింఛన్ ఇచ్చింది చంద్రబాబే అని అన్నారు. 2014 నాటికి రాష్ట్రంలో 39,27,521 పింఛన్లు ఉండగా 2019 మార్చి నాటికి 54.25 లక్షలకు చేరాయని అన్నారు. జగన్ రూ.3వేలు పింఛన్ ఇస్తానని చెప్పి ఏడాదికి రూ.250 మాత్రమే పెంచారనని, తాము ఎన్నికలలో చెప్పినట్టు ఏప్రిల్ నుంచే పింఛన్ పెంపు వర్తింపజేస్తున్నామని అన్నారు. జూలైలో పెంపు బకాయితో కలిపి ఒక్కొక్కరికి రూ.7వేలు ఇస్తామని అన్నారు. జూలై 1న రాప్తాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ సచివాలయ ఉద్యోగి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొనాలని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాలసునీత

డయేరియా దడ

పెరుగుతున్న బాధితులు.. పారిశుధ్య లోపమే కారణం

కళ్యాణదుర్గం/రాయదుర్గం రూరల్, జూన్ 29: జిల్లాలో అతిసార విజృంభిస్తోంది. వాంతులు, విరేచనాలతో బాధపడేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. అపరిశుభ్రతే దీనికి ప్రధాన కారణమని స్పష్టంగా అర్థమౌతోంది. పారిశుధ్య నిర్వహణ లోపం, అధికారుల నిర్లక్ష్యంతో పలువురు ఆస్పత్రులపాలవుతున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం టౌన్‌లో వంద మందికి పైగా అతిసార బాధితులు ఉన్నారు. కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో రోజుకు సగటున పది మంది అతిసార చికిత్స పొందుతున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలో రోజూ సీహెచ్‌సీకి కేసులు వస్తున్నాయి. శీబావి, ముదిగల్లు, కంబదూరు, బ్రహ్మసముద్రం, దొడఘట్ట ప్రాంతాల నుంచి ఎక్కువ మంది బాధితులు ఆస్పత్రులకు వస్తున్నారు.

నీరసంగా ఉంటోంది..



వారం రోజుల నుంచి వాంతులు, విరేచనాలు అధికం కావడంతో నీరసంగా ఉంటోంది. ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకుంటున్నాను. జ్వరం కూడా వస్తోంది. ఎన్ని మందులు వేసుకున్నా తగ్గడం లేదు. దోమలు, ఈగలు మా గ్రామంలో విపరీతంగా పెరిగిపోయాయి. దీని వల్లే అతిసార బాధితుల సంఖ్య పెరుగుతోంది.

- చందన, ముదిగల్లు, కళ్యాణదుర్గం మండలం

వారం రోజుల నుంచి..



వాంతులు, విరేచనాలతో వారం రోజుల నుంచి బాధపడుతున్నాను. ఓపిక ఉండడం లేదు. నీరసంగా ఉంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎన్ని మందులు వేసుకున్నా తగ్గడం లేదు. భయమేస్తోంది.

- వన్నూరమ్మ, శీబావి



సీహెచ్‌సీలో వైద్యం తీసుకుంటున్న బాధితులు



కంబదూరు మారెమ్మ గుడి దేవాలయం వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నుంచి పారుతున్న మురుగు నీరు

మురుగునీటి వల్లే...



మా గ్రామంలో అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు పెరిగిపోయాయి. వాటి వల్లే అతిసార ప్రబలింది. చాలా మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఓపిక అసలు ఉండడం లేదు. ఏమీ తినడానికి కావడం లేదు. చివరికి ఆసుపత్రిలో చేరాం. - **రామాంజనేయులు, శీబావి, కళ్యాణదుర్గం మండలం**

నాగిరెడ్డిపల్లిలో..

రాయదుర్గం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వారం నుంచి అతిసార కేసులు పెరుగుతున్నాయి. సుమారు 20 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరారు. ఎస్సీ, బీసీ కాలనీలకు చెందిన వన్నూరుస్వామి, సునీతమ్మ, ఇంద్రాక్షి, లక్ష్మీ, గాలప్ప, సునీతమ్మ, బసవరాజు, బసన్న, సిద్ధలింగమ్మ, బసవరాజు, అనితమ్మ, ఆశవర్కర్ లక్ష్మీ, దానమ్మ, షర్మిల, రాధమ్మతో పాటు మరికొంతమంది అతిసారతో బాధపడుతున్నారు. వీరిలో నలుగురు కణేకల్లు క్రాస్ వద్ద ఉన్న ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సిద్ధలింగమ్మ, బసవరాజు బళ్లారిలో చికిత్స చేయించుకున్నారు. అనంతపురం ఆసుపత్రిలో అనితమ్మ అనే మహిళతో పాటు మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారం నుంచి వైద్య సిబ్బంది గ్రామానికి వచ్చి చికిత్స చేసినా వ్యాధి తగ్గడం లేదని బాధితులు వాపోతున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్రప్రసాద్ తెలిపారు.



చికిత్స పొందుతున్న వన్నూరుస్వామి, అమలమ్మ, షర్మిల

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతపురం టౌన్: జిల్లాలో అతిసార కేసుల సమాచారం కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏ గ్రామంలోనైనా వాంతులు, విరేచనాలతో ఎవరైనా బాధపడుతుంటే కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబరు 08554 277434కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కంట్రోల్‌రూమ్ 24గంటలూ అందుబాటులో ఉంటుందని అన్నారు.

జిల్లా ఆస్పత్రిలో తగ్గిన కేసులు

జిల్లా సర్వజన ఆస్పత్రిలో అతిసార కేసులు తగ్గాయి. ఆస్పత్రిలో శనివారం వరకూ 63 మంది అడ్మిషన్ అయి చికిత్స పొందారు. వీరిలో పలువురు కోలుకుని ఇళ్లకు వెళ్లారని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 51 మంది అతిసార బాధితులు చికిత్స పొందుతున్నారని అన్నారు.

ఎస్‌జీటీ పోస్టులను పెంచాలి

డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



అనంతపురం విద్య, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 117 జీవోను రద్దు చేయాలని, ఎస్‌జీటీ పోస్టులు పెంచాలని డీఎస్సీ అభ్యర్థులు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారని అన్నారు. జిల్లాలో డీఎడ్ పూర్తి చేసి, ఎస్‌జీటీ పోస్టులకు సిద్ధమయ్యే టీచర్లు వేలాది మంది ఉన్నారని గుర్తుచేశారు. జిల్లాలో 183 ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేస్తారని చెబుతున్నారని, వాటిని 1500 పోస్టులకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఆనంద్, మంజునాథ్, ఉమామహేష్, సమీర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనంలో దూరిన పామును వెతుకుతున్న యువకులు.. పామును చంపేస్తున్న స్థానికులు



బైకులో పాము



బుక్కరాయసముద్రం తహసీల్దారు కార్యాలయ సమీపంలో నిలిపిన ఓ బైక్‌లో పాము దూరింది. కార్యాలయంలో పని నిమిత్తం వచ్చిన శివరాం అనే వ్యక్తి.. తన బైక్‌ను పార్కింగ్ చేసి.. తెలిసినవారితో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఓ పాము అతడి బైక్‌లోకి దూరింది. గమనించిన శివరాంతోపాటు అక్కడున్న వారు పామును బయటకు తీయడానికి సుమారు గంటపాటు ప్రయత్నించారు. కర్రలతో ఎంత శబ్దం చేసినా అది బయటకు కాలేదు. అప్పటికే జనం గుంపులుగా పోగయ్యారు. కర్రలతో పదే పదే పొడవటంతో పాము ఒక్కసారిగా బయటకు వచ్చింది. దీంతో కొట్టి చంపేశారు. **- అనంతపురం సిటీ**







టీ-20 ప్రపంచ కప్‌ను భారత్ కైవసం చేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. అనంతపురం నగరంలోని క్లాక్ టవర్ ప్రాంతంలో అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో వందలాది మంది క్రీడాభిమానులు బాణ సంచా పేల్చి, కేకులు కట్ చేసి సందడి చేశారు.



మెడికల్ కాలేజీ హాస్టల్‌లో చోరీ

ఖరీదైన ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు మాయం



సీసీ కెమెరాల్లో దొంగ

అనంతపురం క్రైం, జూన్ 29: అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాల వసతి గృహంలో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. వైద్య విద్యార్థులకు చెందిన 10 ఆపిల్, 5 ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్స్, ఒక ట్యాబ్, రెండు ల్యాప్‌టాప్‌లను ఎత్తుకుపోయారు. వీటి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల పక్కనే మెడికల్ కాలేజీ హాస్టల్ ఉంటుంది. మొదటి, నాలుగో అంతస్తులో తలుపులు తెరచి ఉంచిన గదుల్లోకే దొంగలు చొరబడ్డారు. దొరికినవి దొరికినట్లు తీసుకుపోయారు. మొదట రెండు ఫోన్‌లు పోయినట్లు భావించారు. ఆ తరువాత మిగిలిన విద్యార్థులు కూడా ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు కనిపించడం లేదని చెప్పడంతో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. ముగ్గురు దొంగలు వసతి గృహంలో ప్రవేశించినట్లు గుర్తించారు. గతంలోనూ ఇదే వసతి గృహంలో సెల్ ఫోన్‌ల చోరీ జరిగింది. వైద్య కళాశాల వద్ద సెక్యూరిటీ లేనందుకే తరచూ చోరీలు జరుగుతున్నాయని వైద్య విద్యార్థులు వాపోతున్నారు. కేవలం రెండు మొబైల్స్, ఒక ట్యాబ్ మాత్రమే చోరీకి గురయ్యాయని టూటౌన్ సీఐ క్రాంతికుమార్ చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ హాస్టళ్లకు మహర్దశ



● నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వసతి గృహాలు ● మొదటి విడతగా రూ.1.35 కోట్లు

● కూటమి అధికారంలోకి రాగానే హాస్టళ్ల మెరుగుకు అడుగులు ● 10 ఎస్సీ వసతి గృహాలు.. ఒక అంబేడ్కర్ గురుకులం ఎంపిక ● బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలకూ అవకాశం దక్కేనా..?

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్29 : జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లుగా సంక్షేమ వసతిగృహాలు అరకొర వసతుల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి లేమితో అటు విద్యార్థులు... వార్డెన్లు నరకం అనుభవించారు. నాలుగేళ్లల్లో పలు దఫాలుగా నిధలు కేటాయించాలని ఆయా సంక్షేమశాఖల అధికారులు గత ప్రభుత్వానికి నివేదికలు పంపినా అవన్నీ చెత్తబుట్టకే పరిమితం కావడంతో అరకొర వసతుల నడుమే విద్యార్థులు వసతి పొందాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. విద్యార్థుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' పలు దఫాలుగా పదుల సంఖ్యలో కథనాలను ప్రచురించింది. విద్యార్థుల అవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కళ్లకు కట్టినట్లుగా కథనాల రూపంలో చూపించింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే మరోసారి ఆంధ్రజ్యోతిలో ఈ నెల 19న నాలుగేళ్లుగా వసతిగృహాల దుస్థితిపై ప్రధానంగా కథనాన్ని ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రత్యేక ఎంపీడీఓలు, తహసీల్దార్లతో హాస్టళ్లను పరిశీలన చేయించి నివేదికలను తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించిన నేపథ్యంలో... నిధులను కేటాయించాలని కలెక్టర్ నిర్ణయించారు. మొదటి విడతగా జిల్లా వ్యాప్తంగా ఉన్న 10 ఎస్సీ హాస్టళ్లు, కురుగుంటలోని ఓ అంబేడ్కర్ గురుకులాన్ని ఎంపిక చేశారు. వీటి కోసం దాదాపు రూ. 1.35 కోట్లు విడుదల చేశారు. మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నాలుగేళ్లుగా వసతుల లేమితో ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, వార్డెన్లు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

20 రోజుల్లో వసతి గృహాల్లో మార్పులకు శ్రీకారం...

వసతిగృహాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి అడుగులు వేయడంలో జిల్లా కలెక్టర్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ పాత్రలు కీలకమనే చెప్పాలి. వసతిగృహాల దయనీయ పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు చేర్చడంలో జేడీ మధుసూదన్‌రావ్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. జేడీ అందించిన నివేదికలు, క్షేత్రస్థాయిలోకి కలెక్టర్ వెళ్లడం వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. రోజుకో హాస్టల్‌ను పరిశీలించి సమస్యలపై దృష్టి సారించారు. అందుకు కావాల్సిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధంగా చేశారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లను నియమించి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో పరిశీలనకు పంపారు. ఆ పరిశీలనలో హాస్టళ్ల దుర్భర పరిస్థితులను ఆయా ఎంపీడీఓలు, తహసీల్దార్లు కలెక్టర్‌కు నివేదికల రూపంలో అందజేశారు. వాటిని రాష్ట్రస్థాయి అధికారులు, ప్రభుత్వం దృష్టికి జిల్లా కలెక్టర్ తీసుకెళ్లినట్లు సమాచారం. ఇందుకు ముందుగా జిల్లా బడ్జెట్‌ను వినియోగించుకోవాలని... తరువాత ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు అధికారిక వర్గాల ద్వారా అందిన సమాచారం. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ మొదటి విడతగా కొన్ని హాస్టళ్లను ఎంపిక చేసి రూ. 1.35 కోట్లు నిధుల విడుదలకు ఆమోదం తెలిపారు. ఇలా వసతిగృహాల మరమ్మత్తులకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు చేసిన కృషి పట్ల పలువురు వార్డెన్లు, సంక్షేమశాఖల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు కేటాయించిన నిధులు

అనంతపురం ఎస్సీ గర్ల్స్ హాస్టల్-1	రూ. 10,82,400
ఎస్సీ గర్ల్స్ హాస్టల్-2	రూ. 11,93,100
రాయదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహం	రూ. 11,25,450
శెట్టూరు ఎస్సీ బాలుర వసతిగృహం	రూ. 10,14,750
గుంతకల్లు ఎస్సీ బాలికల వసతి గృహం నెం-1	రూ. 5,90,400
ఎస్సీ బాలికల వసతిగృహం నెం-2	రూ. 8,36,400,
తాడిపత్రి బాలుర వసతి గృహం	రూ. 17,83,500
శింగనమల బాలుర వసతిగృహం	రూ. 13,53,000
రాకెట్ల ఎస్సీ బాలుర వసతిగృహం	రూ. 10,14,750
కూడేరు ఎస్సీ బాలుర వసతి గృహం	రూ. 12,54,600
కురుగుంట అంబేడ్కర్ గురుకులం	రూ. 22,50,000

మొత్తం రూ. 1,35,82,850 కోట్లు నిధులను కేటాయిస్తూ త్వరితగతిన మరమ్మత్తులు పూర్తి చేయాలని ఏపీ విద్యాసంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఏఈని కలెక్టర్ ఆదేశించారు.

బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలు మరమ్మతులకు నోచుకునేనా..?

ఎస్సీ వసతిగృహాల మరమ్మత్తులకు రూ. 1.35 కోట్లు కేటాయించడంతో... బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాల మరమ్మతులు జరుగుతాయని ఆయా సంక్షేమశాఖల అధికారులు, వార్డెన్లు ఆశలు పెట్టుకున్నారు. ఆయా సంక్షేమశాఖల పరిధిలో జిల్లా వ్యాప్తంగా చాలా వసతి గృహాలు శిథిలమయ్యాయి. అందులో ప్రమాదకర స్థితిలో ఉన్న వాటిని పరిశీలిస్తే... ఆమిద్యాలలోని బీసీ హాస్టల్ పూర్తిగా శిథిలమైంది. పై కప్పు పెచ్చులూడిపోవడంతో... చిన్నపాటి వర్షానికే గదుల్లో నీరంతా కారుతోంది. అందులోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ వసతి పొందుతున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో బయటి బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో బయటి ప్రాంతాలకు వెళ్తున్నారు. గుత్తి కొండ కింద ఉన్న బీసీ బాలుర వసతిగృహం పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందోనన్న భయానకర పరిస్థితుల నడుమ విద్యార్థులు వసతి పొందుతున్నారు. కంబదూరులోని బీసీ వసతిగృహం సైతం పూర్తిగా శిథిలమైంది. రుద్రంపేటలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో కొన్ని గదులకు తలుపులు లేవు. గార్లదిన్నె మైనార్టీ గురుకులంలో తాగునీటి వసతి విద్యార్థులను పట్టిపీడిస్తోంది. ఇవన్నీ మచ్చుకు వసతిగృహాల్లోని సమస్యలు మాత్రమే పదుల సంఖ్యల వసతిగృహాల్లో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే సంక్షేమ వసతిగృహాలకు పూర్వవైభవం వస్తుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆయా సంక్షేమశాఖల ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ సమస్యలు ఎదుర్కొంటున్న హాస్టళ్ల నివేదికలను పంపినట్లు తెలుస్తోంది.



హాస్టళ్ల దయనీయ పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాలు

అరకొర వసతుల మధ్యే హాస్టళ్లు...

జిల్లాలో నాలుగేళ్లుగా దాదాపు వసతిగృహాలు అరకొర వసతుల నడుమ కొనసాగాయనే చెప్పాలి. ఈ నేపథ్యంలోనే మొదట విడతగా అత్యధిక సమస్యలున్న వసతి గృహాలను ఎంపిక చేశారు. ఆ వసతిగృహాల్లో ప్రధానంగా ఎలక్ట్రికల్, రూఫ్, పెయింటింగ్, ఆర్వో ప్లాంట్ మరమ్మతులు, కొన్ని చోట్ల కొత్త ఆర్వో ప్లాంట్లు, పైపులైన్ లీకేజీలు, డ్రైనేజీలు ఉన్నట్లు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా 10 ఎస్సీ వసతిగృహాలు, ఒక అంబేడ్కర్ గురుకులాన్ని ఎంపిక చేశారు.

వసతిగృహాలకు పూర్వ వైభవం : మధుసూదన్‌రావు, జేడీ, ఎస్సీ సంక్షేమశాఖ



ఎస్సీ వసతిగృహాలకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నాం. సమస్యలున్న హాస్టళ్ల వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించాం. కలెక్టరే స్వయంగా హాస్టళ్లను పరిశీలించారు. మొదటి విడతగా జిల్లాలో అత్యంత సమస్యల నడుమ ఉన్న 10 ఎస్సీ వసతిగృహాలను మరమ్మతులకు ఎంపిక చేశాము. అవన్నీ పూర్తవగానే మిగిలిన వసతిగృహాలకు సంబంధించి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపడం జరుగుతుంది. ఏదేమైనా ఈసారి వసతిగృహాలు పూర్తిస్థాయిలో మరమ్మత్తులకు నోచుకుంటాయి. విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తారని ఆశిస్తున్నాం. ఈ విషయంలో కలెక్టర్ పాత్ర చాలా కీలకమనే చెప్పాలి.

ఐటీఐ ప్రవేశాలకు ద్వితీయ కౌన్సెలింగ్

అనంతపురం సెంట్రల్, జూన్ 29: ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని బాలుర ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి శనివారం తెలిపారు. ఇప్పటికే ప్రథమ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ద్వితీయ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జూలై 27వరకు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

8నుంచి ఎస్కేయూ తరగతులు

అనంతపురం సెంట్రల్, జూన్ 29: వేసవి సెలవులు ముగింపు అనంతరం జూలై 8నుంచి ఎస్కేయూలో తరగతులు పునఃప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి శనివారం ప్రకటనలో తెలిపారు. జూలై 1నుంచి బోధన, బోధనేతర ఉద్యోగులు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తడంతో తరగతుల ప్రారంభానికి ఆలస్యమవుతోందన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్ పోటీలు ఆదివారం విశాఖపట్నంలోని పోలీస్ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. రాయలసీమ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. వివరాలకు సెల్ నంబరు 8074106154, 7386355741లను సంప్రదించాలని కోరారు.

టమోటా మార్కెట్ ప్రారంభం


తెరుచుకున్న మండీలు

అనంతపురం రూరల్, జూన్ 29: కక్కలపల్లి క్రాస్‌లోని టమోటా మార్కెట్ ప్రారంభమైంది. టమోటా సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లోని మండీల నిర్వాహకులు మండీలను సిద్ధం చేశారు. పంట చేతికొచ్చే సమయం దగ్గర పడుతుండటంతో అమ్మకాలకు ఏర్పాట్లు చేపట్టారు. మార్కెట్‌లో 20కిపైగా మండీలున్నాయి. ఇందులో ఇప్పటికే పలు మండీలు ఇటీవల ప్రారంభించారు. మరికొన్నింటిలో చిన్న చిన్న మరమ్మత్తుల పనులు చేపడ్తున్నారు. శనవారం రెండు మూడు మండీలకు 50నుంచి 100బాక్సుల వరకు టమోటా రావడం జరిగింది. వారం పదిరోజుల్లో మార్కెట్‌లో టమోటా సందడి పెరగనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూన్29: మండలంలోని కొండపల్లి గ్రామసమీపంలో శనివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కనగానపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కంబదూరు మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన పవన్‌కుమార్(31) తన ద్విచక్రవాహనంలో కంబదూరు నుంచి అనంతపురం వెళ్తున్నాడు. మండలంలోని కొండపల్లి వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనున్న రాళ్లకుప్పలమీద పవన్‌కుమార్ ఎగిసిపడ్డాడు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు కనగానపల్లి పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బోరు వాహనం డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. అతనికి భార్య వాణి ఉంది.



మృతిచెందిన పవన్‌కుమార్, ఎగసిపడిన ద్విచక్రవాహనం

అనంతలో ఎన్నికల వ్యయ పరిశీలకులు

అనంతపురం టౌన్, జూన్29 : సార్వత్రిక పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఖర్చుల వివరాలను తేల్చడానికి కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు శనివారం అనంతపురం చేరుకున్నారు. ఐఏఎస్ అధికారులు నితిన్ అగర్వాల్, రాందాస్ టి, కాలే, విలాస్ వి, షిండే ఢిల్లీనుంచి అనంతకు చేరుకున్నారు. వారికి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వసతి ఏర్పాటు చేసారు. కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలకులను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈపరిశీలకులు వారం రోజులు పాటు జిల్లాలోనే ఉంటారు. ఇటీవల జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులందరూ ఫైనల్ ఖర్చుల వివరాలను వారికి అందజేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి తుది నివేదిక ఇవ్వనున్నారు.


ఎన్నికల వ్యయ పరిశీలకుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

అక్రమంగా విద్యుత్ వాడితే కేసులు నమోదు : ఎస్ఈ


జిల్లా అధికారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్ఈ

అనంతపురంరూరల్, జూన్29: అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని గెస్ట్ హౌస్‌లో అనంతపురం డివిజన్ విజిలెన్స్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6,380 అక్రమ విద్యుత్ కేసులు నమోదు చేసి రూ.6.66కోట్లు జరిమానా రూపంలో విధించామన్నారు. ఈ ఆర్థిక సంత్సరం ఏప్రిల్, మే నెలల్లో 1225 కేసులు నమోదు చేయడంతోపాటు రూ.90లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ అక్రమ వాడకదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలు విధించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో వ్యవసాయానికి కేటాయించిన నీటిని వాడుతున్నారన్నారు. అంతకు ముందు కదిరి డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేయించారు. ఈకార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ గోపి, డీఈఈ నాగేంద్ర, ఏఈఈ వీరా పాల్గొన్నారు.

అన్నదాతకు బ్యాంకుల నోటీసులు

● లోక్‌అదాలత్‌కు హాజరైన రైతులు ● రుణంలో 10 శాతం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలి : ఏపీ రైతు సంఘం వినతి


జిల్లా కోర్టు వద్ద బాధిత రైతులతో రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 29 : పంట రుణం చెల్లించలేదన్న కారణంతో వందలాది మంది రైతులకు బ్యాంకర్లు కోర్టు ద్వారా నోటీసులు జారీ చేశారు. శనివారం జిల్లా కోర్టులోని లోక్‌అదాలత్‌కు ఆయా రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నల్లప్ప, చంద్రశేఖర్‌లు కోర్టుకు వద్దకు వెళ్లి రైతులను పరామర్శించారు. ఎస్‌బీఐ, కెనరా, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ అధికారులు గత నాలుగు, ఐదేళ్ల నుంచి పంటరుణం చెల్లించలేదన్న కారణంతో రైతులు తీసుకున్న అసలుతోపాటు వడ్డీతో సహా డబ్బులు చెల్లించాలంటూ కోర్టు నోటీసులు జారీ చేశారన్నారు. ఒక్క కెనరా బ్యాంక్ అధికారులు 200 మంది రైతులకు నోటీసులు జారీ చేశారన్నారు. వైసీపీ పాలనలో అతివృష్టి, అనావృష్టిలతో పంటల దిగుబడులు రాలేదని, అలాగే పంటనష్టపోయిన రైతులకు పంటనష్టపరిహాం, ఇన్సూరెన్స్‌లు అందించకపోవడంతో రైతులు పంట రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోయారన్నారు. జిల్లాలో గత ఐదేళ్లల్లో వందలాది మంది రైతులు పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. రైతులు తీసుకున్న పంట రుణంలో 10 శాతం చెల్లిస్తే, మిగతా సొమ్మును మాఫీ చేసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.


రైతు భరోసా కేంద్రం (ఫైల్)

రైతు భరోసా కేంద్రం పేరు మార్పు

● ఇక నుంచి రైతు సేవా కేంద్రం
● మాజీ సీఎం జగన్ ఫొటో తొలగింపు
● నూతన సీఎం చంద్రబాబునాయుడు ఫొటో ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ..

అనంతపురం అర్బన్, జూన్ 29 : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో ఇదివరకు వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న కార్యకలాపాలను మార్పు చేశారు. ఈ మేరకు శనివారం ఏపీ ప్రభుత్వ వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 451 వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక నుంచి వీటిని రైతు సేవా కేంద్రంగా మారుస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఆర్బీకేల్లోని కియోస్కోలు, సాఫ్ట్‌వేర్ యాప్‌ల్లో చిత్రీకరించిన నవరత్నాలు, లోగోలోని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను తక్షమే తొలగించి, నూతన సీఎం నారా చంద్రబాబునాయుడు ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

వ్యవసాయ సలహా బోర్డులు రద్దు

జిల్లా వ్యవసాయ సలహా బోర్డుతోపాటు మండల స్థాయి వ్యవసాయ సలహా బోర్డుల కమిటీలను వెంటనే రద్దు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్‌బీకే ఛానల్, స్టూడియో పేరును ఇక నుంచి పాడి పంటల ఛానల్‌గా మార్చారు. వైఎస్ఆర్ రైతు భరోసా మాస పత్రిక పేరును 'పాడి పంటలు ' గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చీనీ కాయలు టన్ను రూ.19వేలు

అనంతపురంరూరల్, జూన్29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 305 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.


సాత్విక | మహిత | యుగంధర్ | యశ్వంత్ | లక్ష్మీనారాయణ

లోక్ అదాలత్‌లో 4,254 కేసుల పరిష్కారం

అనంతపురం క్రైం,జూన్ 29 : జాతీయ లోక్‌అదాలత్‌లో 4,254 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. శనివారం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో మొత్తం 26 బెంచులు నిర్వహించారు. బాధిత ఫిర్యాదిదారులు రాజీకి సమ్మతించడంతో రాజీపడదగిన 707 క్రిమినల్ కేసులు, 69 సివిల్ కేసులు, 26 మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, 3,452 ప్రిలిటిగేషన్ కేసులకు పరిష్కారం దక్కాయి. ఈ లోక్ అదాలత్‌లో ప్రమాద భరిత కేసులలో కక్షిదారులకు రూ.1,97,80,000 పరిహారం ఇప్పించడానికి రాజీమార్గం కుదిర్చారు. సివిల్ కేసుల్లో రూ.56,63,000 పైగా, ప్రిలిటిగేషన్ కేసులలో రూ.33,32,871 కక్షిదారుల మధ్య రాజీ ప్రకారం ఇప్పించారు. లోక్ అదాలత్ నిర్వహణను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు సత్యవాణి, కార్యదర్శి ప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్29 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న హిజ్రాలు గుర్తింపు కార్డు, ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. http://transgender.dosje.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకొని గుర్తింపు కార్డులు, ధృవపత్రాలను పొందాలన్నారు. వివరాలకు 08554-232380 నెంబర్‌ను సంప్రదించి సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు.

ఫైనల్‌కు అనంత, హైదరాబాద్ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29: వెటరన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, హైదరాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో వెటరన్ క్రికెట్ సెమీస్ పోటీలు జరిగాయి. అనంతపురం, గుంటూరు జట్లు పోటీ పడగా...మొదట బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 13.5ఓవర్లలో 67పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 11.3ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 68పరుగులు చేసి 7వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్ నెల్లూరు,హైదరాబాద్ జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 170పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 16ఓవర్లలో 60పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. దీంతో సెమీస్ లో విజయం సాధించిన అనంతపురం, హైదరాబాద్ జట్లు ఫైనల్‌కు దూసుకెళ్ళాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.


ఫైనల్‌కు చేరిన అనంతపురం జట్టు


అగ్రిమెంట్‌ను చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుత్తిలో డ్రోన్ తయారీ కేంద్రం

గుత్తి జూన్29: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో త్వరలో డ్రోన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. చెన్నైకు చెందిన డ్రోన్ తయారీ సంస్థ 'గరుడా ఏరోస్పేస్' సౌజన్యంతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఎంఓయూ అగ్రిమెంట్లపై సంతకాలు పూర్తయినట్లు ఆయన తెలిపారు. యూనిట్ ప్రారంభించడానికి వారికి స్థల సముదాయాన్ని కల్పిస్తున్నామన్నారు. యూనిట్ ద్వారా రైతులకు సంబంధించిన వివిధ రకాల డ్రోన్‌లు తయారీ చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. తమ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు చదువుతున్న విద్యార్థులు గరుడా ఏరోస్పేస్ సంస్థద్వారా డ్రోన్‌ల తయారీ శిక్షణ, ఇంటర్‌షిప్, డ్రోన్ సర్వీసులు చేపట్టే అవకాశం పొందుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ అధికారి నందిని, ఇంతియాజ్, తన్వీర్, తదితరులుపాల్గొన్నారు.

మీటర్ల ఏర్పాటుపై ఆగ్రహం


తొలగించిన మీటర్లను చూపుతున్న రైతులు

గార్లదిన్నె, జూన్ 29: వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన గార్లదిన్నెలో వ్యవసాయ మోటార్లకు రైతుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా శుక్రవారం సాయంత్రం మీటర్లు అమర్చారు. దీనిపై రైతులు వీరనారప్ప, రమేష్, నల్లప్ప, వీరేంద్ర, శీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య, గుత్తా బాలకృష్ణ రైతులకు మద్దతునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే మీటర్లకు మోటార్లను ఏర్పాటు చేస్తామంటే వ్యతిరేకించడం జరిగిందన్నారు. రైతుల అనుమతులు తీసుకోకుంఅ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా మీటర్లను అమర్చడం ఏంటని ప్రశ్నించారు. మీటర్లు అమరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు



మాట్లాడుతున్న రమేష్‌బాబు

అనంతపురం విద్య, జూన్ 29: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ నేతలతో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్న సమస్యలపై ఆందోళనలు చేశామన్నారు. అయినా స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, ఎండీఎం యూనియన్ జిల్లా కార్యదర్శి బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29: జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారం స్థానిక సాయినగర్‌లో జరిగాయి. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏ1 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జిల్లాస్థాయి అండర్-19 బాల, బాలికల ఓపెన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. అండర్-19 విభాగంలో విజేతగా వెంకట శ్రీచైతన్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, హేమచరణ్ రెడ్డి, కృష్ణ, సుదీంద్ర వెంకట సముద్రాల ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అస్మిత అనిమి, యశస్విని, శ్రీహాజీ, కటారి భువనకృతి గెలిచారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, టోర్నీ చీఫ్ ఆర్బిటార్ మల్లికార్జున, నేషనల్ ఆర్బిటార్లు మెహరాజ్, కాశీరవీంద్ర, కోఆర్డినేటర్లు కిశోర్, గోవిందరాజు పాల్గొన్నారు.

బయో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తయారీ కేంద్రం తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్/రూరల్, జూన్ 29: అనంతపురం నగర శివారు పంగల్ రోడ్డులోని ఎంవీ బయోలాజికల్ బయో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తయారీ కేంద్రాన్ని శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. అక్కడి ల్యాబ్, పలు రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు లోబడి బయో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఏఓ శశికళ, టెక్నికల్ ఏఓ బాలూనాయక్, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్యలు పాల్గొన్నారు.

గుంతకల్లు డీఎంకు ఘనంగా వీడ్కోలు

అనంతపురం కల్చరల్, జూన్ 29: గుంతకల్లు డీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నారాయణస్వామికి శనివారం ఆర్టీసీ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆర్ఎం చాంబర్‌లో నారాయణస్వామికి ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి సీటీఎం రమేష్‌బాబు, అనంతపురం డీఎం నాగభూపాల్, లా ఆఫీసర్ చంద్రశేఖర్, పీఓ చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.


డీఎం నారాయణస్వామిని సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

పింఛన్ల పెంపుపై అవగాహన

శింగనమల జూన్ 29: పింఛన్ల పెంపుపై లబ్ధిదారులకు టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. శింగనమల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ, నాయకుడు చాకలి వెంకటేశ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పెంపుపై వారికి అవగాహన కల్పించారు.

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ.. ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నార్పల, జూన్ 29: నిరుపేదలకు వైద్యం అందించడంలో నిరక్ష్యం చేయవద్దని శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రాణిశ్రీ వైద్యులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని, కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు..? ఓపీకి ఎంత మంది రోగులు వస్తున్నారు..? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చిన వారితో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. సిబ్బంది కొరత ఉందని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. మెనూ మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అనంతరం కొత్తబస్టాండ్‌ను పరిశీలించారు. గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గంగాధర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గాంధీసర్కిల్‌లో దుర్వాసన రాకుండా డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చిరువ్యాపారులకు హామీ ఇచ్చారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ శైలజారాణి, ఎంఈఓ కృష్ణయ్య, నార్పల సెక్రటరీ ఆశ్వర్థనాయుడు, టీడీపీ నాయకులు పిట్టురంగారెడ్డి, ప్రతాప్‌చౌదరి, తిప్పన్న, ఆకుల విజయ్‌కుమార్, ఆలం నాగార్జుననాయుడు, చంద్రబాబు, జనసేన నాయకులు గంజికుంటరామకృష్ణ, తుపాకులభాస్కర్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో పాల్గొనండి: ఎమ్మెల్యే బండారు

శింగనమల: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో టీడీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా పెంచిన పింఛన్లను జూలై 1న లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయడం జరుగుతుందన్నారు.

హామీ మేరకు పింఛన్ పెంపు: దగ్గుపాటి

అనంతపురం అర్బన్: జూలై 1వతేదీన జరిగే పింఛన్ల పంపిణీకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చినమాట మేరకు రూ.4వేలకు పింఛన్ పెంచారన్నారు. బకాయిలతో కలిసి జూలై 1న ఒక్కో పింఛన్‌దారుడికి రూ.7వేలు అందజేయనున్నామన్నారు.

కూచిపూడి కళాకారులకు కలెక్టర్ అభినందన


కూచిపూడి కళాకారులతో కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్29: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న తాడిపత్రికి చెందిన కూచిపూడి కళాకారులను కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు. శనివారం సాయిమైత్రి, జ్యోషిత, వర్షిని, నవ్య, సాహిత్య, నిహారిక తదితరులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలశారు. కేదార్‌నాథ్ ఆలయం వద్ద మైనస్ 2డిగ్రీల ఉష్ణోగ్రతలో తాము ప్రదర్శన చేసినట్లు కలెక్టరుకు వివరించారు. మీ ప్రతిభ అనంతజిల్లాకే గర్వకారణమని ఈ సందర్భంగా కలెక్టరు కళాకారులను కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, వందన డాన్స్ అకాడమీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ


మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు

అనంతపురంరూరల్, జూన్ 29: మండలంలోని కురుగుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించడం హర్షణీయమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ.1.35కోట్లు కేటాయించారన్నారు. నిధులు కేటాయించిన కలెక్టర్ వినోద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎల్లన్న, సాకే చిరంజీవి, రామన్న, గురుకుల పాఠశాల కురుగుంట విద్యా కమిటీ చైర్మన్ రామాంజినేయులు, అప్కా కమిటీ అధ్యక్షులు ఓబులపతి, ఎమ్మార్పీఎస్ నాయకుడు శీను, నర్సనేకుంట తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటిని దర్శించుకున్న ఎస్పీ


ఎస్పీకి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

గుంతకల్లు టౌన్, జూన్ 29: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిని అనంతపురం ఎస్పీ గౌతమిశాలి శనివారం దర్శించుకున్నారు. ఎస్పీ గౌతమి శాలికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయానికి ప్రదక్షిణ చేసిన అనంతరం అర్చకులు ఆమె పేరిట అర్చనలు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ ఏఈఓ మల్లికార్జున, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబ సభ్యులు


కాలినడకన తిరుమలకు చేరిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

అనంతపురంరూరల్, జూన్ 29: కాలినడకన తిరుమలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులు వెళ్లారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి మొక్కుకున్నారు. ఈక్రమంలో శనివారం ఆయన సతీమణి శ్రీలక్ష్మి, కుమార్తె దగ్గుపాటి అశ్రిత, మనిహాస్ తదితరులు అలిపిరి నుంచి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు చేరకున్నారు. ఎమ్మెల్యే దుగ్గపాటి కూడా తిరుమలకు చేరుకున్నారు.


స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, జూన్ 29: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. స్వామివారి దర్శనానికి భక్తు లు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజ స్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.


ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సీఎం చంద్రబాబును కలిసిన రామలింగారెడ్డి


చంద్రబాబుతో రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, జూన్ 29: రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అంశాలపై ఆయనకు వివరించారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును, డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక టిప్పర్ల సీజ్

గార్లదిన్నె/శింగనమల, జూన్ 29: కల్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 టిప్పర్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ నాగసునీత తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 టిప్పర్లను పట్టుకుని 4 టిప్పర్లను శింగనమల పోలీస్‌స్టేషన్‌కు, ఒకదానిని గార్లదిన్నెస్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న సెబ్ అధికారులు

అలరించిన భక్తి గీతాలు

పుట్టపర్తి: బాపట్ల జిల్లా సేవాదళ్ నిర్వహించిన భక్తి ఆలాపన సత్యసాయిబాబా భక్తులను అలరించింది. పర్తి యాత్ర పేరుతో బాపట్ల సేవాదళ్ సభ్యులు శనివారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సంగీ త సుధామాధురి పేరిట సంగీత గాన కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



ర్యాలీని విజయవంతం చేయండి

ధర్మవరం రూరల్ (కనగానపల్లి), జూన్ 29: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కనగానపల్లి సర్పంచ్ అంకే పరిమళరామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు కనగానపల్లి మండలకేంద్రంలో విజయోత్సవ ర్యాలీ ఉంటుందని, ర్యాలీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీతో పాటు ఎంపీ బీకే పార్థసారథి, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ర్యాలీకి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అడ్డగోలు బదిలీపై విచారణ చేయాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అనంతపురం విద్య, జూన్ 29: ఉపాధ్యాయుల అడ్డగోలు బదిలీలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హరికృష్ణ, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్రమ బదిలీల వ్యవహారంలో కోట్ల రూపాయలు ఉపాధ్యాయుల నుంచి దోచుకున్నారంటూ ఉపాధ్యాయులే బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో పై స్థాయిలో పలువురు ఉన్నతాధికారుల భాగస్వామ్యం ఉన్నట్టు కూడా టీచర్ల నుంచి విమర్శలు వస్తున్నాయన్నారు. అక్రమ బదిలీల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్లు, రెండు ఉపాధ్యాయ సంఘాలపై విచారణ చేసి, వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి

ఎంపీడీఓ వెంకటరమణ

శింగనమల జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జూలై 1న ప్రారంభంకానుందని, రెండు రోజుల్లో పంపిణీ ప్రక్రియను పూర్తిచేస్తామని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మండలంలో 13 సచివాలయంలో 6497 పింఛన్లు ఉన్నాయని ఒక సచివాలయం ఉద్యోగికి 50 మంది పింఛన్లు దారులు ప్రకారం ఇంటింటికీ వెళ్లి పంపణీ చేయించడం జరుగుతుందన్నారు. రెండు రోజుల్లో పంపిణీ ప్రక్రియ పూర్తి చేసేవిధంగా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు.

విజయవంతం చేయండి

ఆత్మకూరు జూన్ 29: పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతున్నారన్నారు. మండల కేంద్రంలోని రామలింగేశ్వర కల్యాణమంటపంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

చీనీ వ్యాపారి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, జూన్ 29: మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన బాబయ్య శనివారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మర్తాడుకు చెందిన బాబయ్య చీనీపండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగించేవాడు. అయితే శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


మాట్లాడుతున్న మేరీ

చెన్నేకొత్తపల్లి, జూన్ 29: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థ చైర్మన్ సీకే గంగూలి, కార్యదర్శి మేరివటమట్టం సూచించారు. చెన్నేకొత్తపల్లిలోని ఆ సంస్థ కార్యాలయ ఆవరణంలో శనివారం ఆదిశక్తి సొసైటీ 27వ వార్షిక మహాసభను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఆదిశక్తి సొసైటీ ప్రస్తుతం 8,601 మంది సభ్యులతో దాదాపు రూ.18కోట్ల లావాదేవీలతో నడుస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీకవిత, మహాశక్తి సీఈఓ రమీజా, ప్రోగ్రాం మేనేజర్లు సుకన్య, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన అమిలినేని


మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూన్ 29: ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పరిశ్రమలు, మెరుగైన విద్యకోసం ఉపాధ్యాయులు, భవనాలు, తదితర వాటికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు.


రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని...: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావుని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు రాజగోపాల్ కలిసి కొత్తగా ఎన్నుకున్న శ్రీనివాస్‌రావుకు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు.

దుర్గమ్మకు పూజలు...: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బెజవాడ కనకదుర్గమ్మను శనివారం దర్శించారు. ఆయనతో పాటు రాజగోపాల్ తదితరులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో రామారావు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈవో ఎమ్మెల్యేకు అమ్మవారి చిత్రపటాన్ని అందచేసి, వేదపండితుల ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.

మంత్రి సవితను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చేనేత సంఘం నాయకులు

తాడిపత్రి టౌన్, జూన్ 29: పెనుకొండలోని ఆర్ అండ్‌బీ బంగ్లా లో శనివారం చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ను జిల్లా చేనేత అధ్యక్షుడు నారాయణస్వామి కలిశారు. ఆయన మాట్లాడుతూ కుదేలైన చేనేత పరిశ్రమను గాడిలో పెట్టాలని మంత్రికి విన్నవించామన్నారు. కేంద్రం నుంచి చేనేత పరిశ్రమ అభివృద్ధికి రూ.5వేల కోట్ల నిధులను తెచ్చేవిధంగా కృషిచేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాగరాజు, సుధాకర్, శ్రీనివాసులు, రమణ, కృష్ణమూర్తి, నాగేంద్ర ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించండి: ఎమ్మెల్యే అశ్మిత్


ఏపీఐఐసీ అధికారులతో ఎమ్మెల్యే అశ్మిత్

తాడిపత్రిటౌన్, జూన్ 29: తాడిపత్రిలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగార్జున, జిల్లా మేనేజర్ నాగరాజరావులను కోరారు. అనంతపురంలోని స్థానిక నివాసంలో శనివారం ఎమ్మెల్యేని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనతో చాలావరకు మూతపడ్డ గ్రానైట్, నల్లబండల పరిశ్రమలకు పూర్వవైభవం తెచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. తాడిపత్రి పరిసర ప్రాంతాలు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని ఈ ప్రాంతంలో ముడిసరుకు కూడా లభ్యమవుతుందని తెలిపారు. దీంతో ఎక్కువగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఎక్కువగా ఉపాధి లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే జేసీ సూచనలకు వారు స్పందిస్తూ నిరుద్యోగితను రూపుమాపేందుకు మావంతు సహకారం తప్పకుండా ఇస్తామని ఆయనకు తెలిపారు.

హెచ్చెల్సీకి మరమ్మతులు చేయించండి

పుట్లూరు, జూన్ 29: మండలంలోని హెచ్చెల్సీకి మరమ్మతు పనులు చేయాలని టీడీపీ మం డల నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి ఎంపీ అం బికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. ఢిల్లీలో ఎంపీని కలిసి మండల సమస్యలు వివరించామన్నారు. పుల్లారెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలోని ఏ.కొండాపురం నుంచి పుట్లూరు చెరువు వరకు హెచ్చెల్సీ కాలువ అనేకచోట్ల ప్లాట్‌ఫామ్, ఇరుపక్కల బండలు దెబ్బతిని గండ్లు పడుతున్నాయన్నారు.

ఆర్డీటీ హాకీ అకాడమీకి ఎంపికైన జ్యోతి

విడపనకల్లు, జూన్ 29: పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని బీ జ్యోతి ఆర్డీటీ అకామీకి ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జ్యో తికి ఆర్డీటీ సంస్థ వేసవిలో హాకీ శిక్షణ ఇచ్చారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళలతో పాటు ఉపాధ్యాయులు జ్యోతిని అభినందించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు ఈశ్వరప్ప దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కుందుర్పి, జూన్ 29: మండలంలోని తగ్గుపర్తి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు బులిగొండ్ల ఈశ్వరప్పను శనివారం ఉపాధ్యాయ బృందం, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సామాజిక సేవా కార్యకర్తగా, కళాకారుడిగా ప్రశంసలందుకుని ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఈశ్వరప్ప సేవలను వారు కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాదరెడ్డి, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, జయరాములు, జయప్ప, వెంకటనాయుడు, బెళుగుప్ప మల్లికార్జున, దామోదర నాయుడు, అవులెన్న సర్పంచ్ రాము, బీజేపీ నాయకులు వన్నూరుస్వామి, కోనంకి యర్రిస్వామి, జనసేన నాయకులు సుధీర్ పాల్గొన్నారు.

గుంతకల్లు డీఎంకు ఘనంగా వీడ్కోలు


డీఎం నారాయణస్వామిని సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, జూన్ 29: గుంతకల్లు డీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నారాయణస్వామికి శనివారం ఆర్టీసీ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్ఎం చాంబర్‌లో నారాయణస్వామికి ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని చేతులమీదుగా జ్ఞాపిక, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆర్ఎం మాట్లాడుతూ 38 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో నారాయణస్వామి ఆర్టీసీకి అందించిన సేవలు మరవలేనివన్నారు. డిప్యూటీ సీటీఎం రమేష్ బాబు, అనంతపురం డీఎం నాగభూపాల్, లా ఆఫీసర్ చంద్రశేఖర్, వీఓ చెంద్రాయుడు పాల్గొన్నారు.

ప్రకటన

వై.అంజినమ్మ W/o ఎరికల మధు, D.No.17/826A-2, తిలక్ నగర్, గుంతకల్లు వారికి సంబంధించిన ఆస్తి గుంతకల్లు మండలం కసాపురం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెం.446-Bలో ప్లాట్ నెం.19/A, 20/A, 21/A, 150 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగు తున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల గుంత కల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు :- తూర్పు: రోడ్డు,పడమర: సింహాల చౌదన్న గారి భూమి, ఉత్తరం: ప్లాట్ నెం.18/A, దక్షిణము: ప్లాట్ నెం.22/A.

M.G. భాస్కర్‌గౌడ్
అడ్వకేట్, గుంతకల్లు

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

కుందుర్పి, జూన్ 29: మండలంలోని వెంకటాంపల్లిలో శనివారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పశువైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. పశు గణనాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ నాగలింగేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి ప్రసాద్ శిబిరాన్ని పరిశీలించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుత్తి, జూన్ 29: పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఛైర్ పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యేకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత వైసీపీ ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపాలిటీలో కూడా అధికారులు, సిబ్బంది పని తీరు బాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోదరుడు నారాయణ సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో 30శాతం తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. గుత్తి చెరువుకు హంద్రీనీవా జలాలతో నింపుతామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. నాలుగు రోజుల నుంచి ఆసుపత్రి పరిసరాలలో ఉన్న అపరిశుభ్రతను, మట్టిదిబ్బలు, పిచ్చిమొక్కలను తొలగించారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, నారాయణస్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, నాయకులు ఎంకే చౌదరి, నారాయణస్వామి, రవి, ప్రతాప్ పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన వైస్ ఎంపీపీ


వైస్ ఎంపీపీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పామిడి: వైస్ ఎంపీపీ కాయల మహేష్ వైసీపీని వీడి గుంతకల్లు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సమక్షంలో టీడీపీ గూటికి చేరారు. శనివారం మహేష్‌కు కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు సోదరుడు మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు తన కుమారులతో పాటు అనుచరులతో టీడీపీలోకి చేరారు. ఎమ్మెల్యే జయరాంను పార్టీలోకి చేరుతున్న నాయకులు గజమాలతో సత్కరించారు.

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం: ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు సముచితస్థానం ఉంటుందని జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. ఎన్నికల సంగ్రామంలో వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా టీడీపీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా శ్రమించారన్నారు. అలాంటి కార్యకర్తలకు ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందన్నారు.

కారుబోల్తా.. మహిళకు గాయాలు

కూడేరు, జూన్ 29: మండల పరిధిలోని అరవకూరు, కమ్మూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై కారుబోల్తా పడటంతో చంద్రకళ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం పట్టణానికి చెందిన పరమేశ్వరప్ప, భార్య చంద్రకళతోపాటు చిన్నారి కలసి కారులో శనివారం పెన్న అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించికొని తిరిగి అనంతపురం బయలు దేరారు. కూడేరు మండలం అరవకూరు గ్రామానికి కొద్దిదూరంలో కారుబోల్తా పడటంతో అందులోనున్న చంద్రకళ తీవ్రంగా గాయపడింది. వెంటనే 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి ఆమెను తరలించారు.

ఇరు వర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్, జూన్ 29: మండలంలోని మామడూగరు గ్రామంలో శనివారం ఇరువర్గాల ఘర్షలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామానికి చెందిన మమత, వరలక్ష్మి ఇంటి వద్ద చిన్నపాటి విషయంలో మాటమాట పెరిగి మమత, పుల్లమ్మ, రామాంజునేయులు కలసి వరలక్ష్మిని కర్రలతో దాడి చేశారు. దాడిలో వరలక్ష్మి, పుల్లమ్మ గాయపడ్డారు. వీరిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ఎదుటే ఘర్షణ

బెళుగుప్ప, జూన్ 29: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు శనివారం పోలీస్ స్టేషన్ ఎదుట ఘర్షణకు దిగారు. రెండు రోజుల క్రితం గ్రామంలో వాగ్వాదం జరగటంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. ఇక్కడ కూడా ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. ఈ సమయంలో స్టేషన్‌కు చేరుకున్న ఎస్ఐ శివ వారిని చెదరగొట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆధిపత్యపోరులో భాగంగా ఒకే పార్టీకి చెందిన వారి మధ్య చిన్న గొడవ జరిగిందని, 16 మందిని బైండోవర్ చేశామన్నారు.

డాబాలో బిల్లు విషయంలో...

గుత్తిరూరల్, జూన్ 29: మండలంలోని యంగిలిబండ గ్రామశివారులోని పంజాబి డాబాలో బిల్లు విషయంలో శనివారం ఘర్షణ పడి ఐదుగురికి గాయాలయ్యాయి. డాబాలో జక్కలచెరువు గ్రామానికి చెందిన హనుమంతు, అశోక్, నరసింహులు భోజనం చేసి బిల్లు కట్టే విషయంలో మాట మాట పెంచుకొని డాబా నిర్వహకులు రాజా సింగ్, ఉపేంద్ర సింగ్‌లు హనుమంతు, అశోక్, నరసింహులను కర్రలతో దాడి చేశారు. దాడిలో ముగ్గురు గాయపడ్డారు. తిరిగి హోటల్ నిర్వహకులపై ముగ్గురు కలసి దాడి చేశారు. దాడిలో ఇద్దరు గాయపడ్డారు. వీరిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సజ్జలదిన్నెలో...

తాడిపత్రిటౌన్, జూన్29: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో శనివారం పింఛన్ల పంపిణీ విషయంలో టీడీపీకి చెందిన సుబ్బయ్య, రంగన్నలు ఘర్షణపడడంతో ఇరువురూ గాయపడ్డారు. జూలై1న పింఛన్ల పంపిణీ విషయంలో సుబ్బయ్య, రంగన్నల మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. సుబ్బయ్యతోపాటు రంగన్న వర్గానికి చెందిన రాజుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దుకాణంలో చోరీ

యాడికి, జూన్ 29: వేములపాడు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణంలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు కుళ్లాయప్ప తెలిపిన మేరకు జాతీయ రహదారి పక్కన కిరాణా దుకాణం నిర్వహించుకుంటున్నట్లు తెలిపాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణానికి ఉన్న రేకులను తొలగించి చోరీకి పాల్పడ్డారని తెలిపారు. రూ.18వేలు విలువైన సిగరెట్ల బండిల్స్, సబ్బులు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు బాధితుడు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


పావని (ఫైల్)

యాడికి, జూన్ 29: పొలంలో పనులకు వచ్చిన కూలీలకు మద్యం తాగించవద్దని చెప్పినా తన మాటలను పెడచెవిన పెట్టాడన్న మనస్థాపంతో పావని (33) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి బోయరెడ్డిపల్లి గ్రామ సమీపాన ఉన్న పెన్నాసిమెంట్స్ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు బనగానపల్లి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహేశ్వర్‌రెడ్డి బోయరెడ్డిపల్లి గ్రామసమీపంలో ఉన్న పొలాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేస్తున్నాడు. శుక్రవారం పొలం పనుల నిమిత్తం కూలీలు వచ్చారు. కూలీలకు పాయసం, అన్నం చేసుకొని వస్తాను వారికి మద్యం తాగించవద్దని భర్త మహేశ్వర్‌రెడ్డికి పావని తెలిపింది. భార్య మాటలను పెడచెవిన పెట్టిన భర్త కూలీలకు మద్యం తాగించాడు. తన మాటలను పెడచెవిన పెట్టడంతో పావని మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పావని తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ దారి మూసివేత


దారి మూసివేతకు గోడకట్టిన దృశ్యం

తాడిపత్రిటౌన్, జూన్ 29: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి అక్రమంగా మున్సిపల్ పార్కులో నుంచి వేసిన రోడ్డును శనివారం మున్సిపల్ అధికారులు గోడకట్టి మూసివేశారు. మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలమేరకు అధికారులు మాజీ ఎమ్మెల్యే నివాసానికి చేరుకోవడానికి అక్రమంగా పార్కులో వేసిన రోడ్డును పరిశీలించారు. అనంతరం కాంపౌండ్ వాల్‌కు గోడను కట్టించి దారిని మూసివేయించారు.

కూచిపూడి కళాకారులకు కలెక్టర్ అభినందన


కూచిపూడి కళాకారులతో కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూన్ 29: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన తాడిపత్రికి చెందిన కూచిపూడి కళాకారులను కలెక్టర్ వినోద్ కుమార్ అభినందించారు. శనివారం ప్రతిభ చూపిన కూచిపూడి కళాకారులు సాయిమైత్రి, జ్యోషిత, వర్షిణి, నవ్య, సాహిత్య, నిహారిక కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం కేదార్‌నాథ్‌లో మే 13వ తేదీన -2 డిగ్రీల ఉష్ణోగ్రతలో రెండున్నర గంటల పాటు కూచిపూడి ప్రదర్శన చేసిన వివరాలను కలెక్టర్ వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ మీ ప్రతిభ అనంత జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. డీఎస్డీఓ షఫీ, వందన డ్యాన్స్ అకాడమీ కూచిపూడి గురువు ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యల గుర్తింపునకు 'శుభోదయం'


ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న తెలుగు తమ్ముళ్లు

పామిడి, జూన్ 29: పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శుభోదయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక తెలుగు తమ్ముళ్లు ఆయా కాలనీలలో సంచరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పట్టణంలోని 20 వార్డులు తిరిగిన అనంతరం ఏయే కాలనీలలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో నివేదికలు తయారు చేసి అందిస్తామన్నారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, బొమ్మా మోహన్‌కృష్ణ, శ్రీరాములు, రాజు, తిమ్మప్ప, ఆచారి పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

తాడిపత్రిటౌన్, జూన్ 29: ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాలమేరకు పట్టణంలోని పాతకోటలో ఉన్న పెద్దకాలువలోని పూడికతీత పనులను శనివారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ అబ్దుల్‌రహీం దగ్గరుండి పర్యవేక్షించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని సిబ్బంది చేత ఎత్తివేయించారు. ఆయన వెంట పలువురు కౌన్సిలర్లు, జనసేన నాయకులు ఉన్నారు.

విశ్రాంత లోకోపైలెట్ బలరామయ్యకు నివాళి

గుంతకల్లుటౌన్, జూన్ 29: ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ జోనల్ ఉపాధ్యక్షుడు, విశ్రాంత లోకోపైలెట్ ఆర్ బలరామయ్య 3వ వర్ధంతిని శనివారం స్థానిక మస్తాన్ పేటలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించారు. బలరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత లోకో పైలెట్‌లు మాట్లాడుతూ బలరామయ్య లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల కోసం రాజీలేని పోరాటాలు చేశాడని కొనియాడారు. డీ రామ్‌నాయక్, ఖాజాహుసేన్, బీ నాగన్న, హెచ్ మహదేవరాయులు, గంగాధర్, కొండయ్య, అమీరుద్దీన్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

గుంతకల్లుటౌన్, జూన్ 29: మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దారు శేషఫణికి శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్‌మాదిగ వినత పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కొందరు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకుని, షాపులు నిర్మించారన్నారు. వివిధ సర్వే నెంబర్లలో ఉన్న కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

గుంతకల్లుటౌన్, జూన్ 29: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం వైద్యులు పత్తిహిమబిందు, వెంకటేశ్వర్లు పాఠ్య పుస్తకాలను అందజేశారు. 50 మంది పేద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అలాగే విశ్రాంత అధ్యాపకుడు రామాంజనేయులు విద్యార్థులకు రూ.26వేలు ఫీజును చెల్లించారు.

గంగమ్మదేవాలయ వార్షికోత్సవం

యల్లనూరు, జూన్ 29: మండలకేంద్రంలోని పాతపేట ఎస్సీకాలనీలో వెలసిన గంగమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను రెండురోజులపాటు జరపనున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ఉరవకొండ,జూన్ 29: లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం లభిస్తుందని న్యాయాధికారి దుర్గా కల్యాణి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 108 కేసులను పరిష్కరించినట్లు న్యాయాధికారి తెలిపారు. న్యాయవాదులు తుకారాం, జయరాజ్, లక్ష్మీనారాయణరెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

స్టార్టర్ చోరీ

శెట్టూరు, జూన్ 29: మండల కేంద్రంలోని రైతు సంతోష్‌కు చెందిన పొలంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్ బాక్సును ఎత్తుకెళ్లినట్లు శనివారం రైతుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడతామన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలి: సీపీఐ


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కూడేరు, జూన్ 29 : అగ్రిగోల్డ్ ఆస్తులను కాపాడాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కూడేరు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. సీపీఐ జిల్లా నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి మాట్లాడుతూ గత పదిరోజులుగా కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కంపలను తొలగిస్తున్నారని, వెంచర్‌ను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు రత్న రాధకకు అందజేశారు. మల్లికార్జున, నారాయణమ్మ, ముట్టాల శ్రీరాములు, రమణ, పాల్గొన్నారు.

నగరవనానికి పూర్వ వైభవం తెస్తాం: కాలవ


నగరవనంలో మొక్కనాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూన్ 29: వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన నగరవనాన్ని అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన నగరవనాన్ని సందర్శించారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటారు. అక్కడ ఉన్న బొమ్మలను, చెట్లను పరిశీలించారు. అటవీశాఖ అధికారి దామోదర్‌రెడ్డితో నగరవనానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రజల ఆనందం, ఉల్లాసం కోసం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రత్యేక చొరవతో పట్టణ శివారులో నగరవనాన్ని ప్రారంభించామన్నారు. గడిచిన ఐదేళ్లలో తీవ్రమైన నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోకుండా పోయిందన్నారు. నగరవనాన్ని రాయదుర్గం ప్రజలకు కానుకగా అందిస్తామని స్పష్టం చేశారు.

నెట్టికంటిని దర్శించుకున్న ఎస్పీ


ఎస్పీ గౌతమి శాలికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

గుంతకల్లు టౌన్, జూన్ 29: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని అనంతపురం ఎస్పీ గౌతమిశాలి శనివారం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆమె ఆలయంలో ప్రదిక్షణలు చేశారు. అర్చకులు ఆమె పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను, స్వామి వారి చిత్రపటం అందజేసి ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, జూన్ 29: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి శనివారం విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి వెండి కవచం అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి, మాజీ ధర్మకర్త కాశీనాథ్ శెట్టి, కొత్తపల్లి మల్లికార్జున, మహేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ


స్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూన్ 29: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు


విద్యార్థి అనిల్‌కు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న ఎల్లియరసి

గుంతకల్లు, జూన్ 29: పట్టణంలోని రైల్వే ఉన్నత పాఠశాలలో క్రీడలు, చదువుల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి దివంగత కల్నల్ మణిరాజ్ తరఫున ఆయన సతీమణి ఎల్లియరసి ఇద్దరు విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులను ఇచ్చారు. ఫుట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటిన అనిల్ అనే విద్యార్థికి, పాఠశాలలో పదో తరగతిలో 552 మార్కులతో టాపర్‌గా నిలిచిన తస్లీమ్ ఖాన్ అనే విద్యార్థినికి రూ.2,500 నగదును అందజేశారు. హెచ్ఎం మధుసూదనరావు, పూర్వ విద్యార్థి థామస్, సల్మా సమియాల్, సరిత పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా మిషన్.. ప్రతిపౌరుడి బాధ్యత


శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో నగరవనంలో మొక్క నాటుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 29: గ్రీన్ ఇండియా మిషన్ ప్రతిపౌరుడి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నర్సారెడ్డి అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో ఆయన చేతుల మీదుగా మొక్కలు నాటారు. అనంతరం కమిషనర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగేనాయక్, పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్ ఆవరణలో మొక్కలు నాటి అక్కడి నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీగా నిర్వహించారు.